క్లుప్తంగా

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం



రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకంలోని ఒక సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించి, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం కైకలూరుకు చెందిన ఘంటాల బసవయ్య ఘంటసాల భక్తి రంజని పేరిట సంగీత కచేరి, రాత్రి నగరానికి చెందిన రామాంజనేయ నాట్య మండలి ఆధ్వర్యంలో రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శించారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సమాచార హక్కు కార్యకర్తల సంఘం జిల్లా కన్వీనర్‌గా హరీష్



ఏలూరు (టూటౌన్): సమాచార హక్కు కార్యకర్తల సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్‌గా నగరానికి చెందిన వైవీ హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపకుడు ముత్తు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో సమాచార హక్కు వినియోగం, ఉపయోగాలపై ప్రజలకు తెలియజేయనున్నట్టు చెప్పారు. సమాచార హక్కు చట్టం అందరికీ తెలిసే విధంగా చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అవినీతిపై అక్రమాలపై ప్రశ్నించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని చెప్పారు.

ఖాళీలను భర్తీ చేయండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను పదోన్నతులు, లేదా సర్దుబాటు ద్వారా భర్తీ చేయాలని కోరారు. గంగాధరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఉదయ్ భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో పేదవర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శనివారపుపేట సారథి గార్డెన్స్‌లో నగరంలోని 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, పార్టీ నాయకులు సత్తిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాని ముఖ్యఅతిథిగా, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదల కుటుంబాలకు మేలు చేయాలనే తపనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించారని చెప్పారు. అర్హత ఉండి ఏదైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందకుంటే అటువంటి వారిని గృహ సారథులు గుర్తించి జగనన్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గత మూడున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో పారదర్శక పాలనతో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి గృహ సారథులు వివరించాలని సూచించారు. రాబోయే కాలంలో జగనన్నకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలిచేలా ప్రత్యేక చొరవ చూపుతూ సమష్టిగా పనిచేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే నాని పార్టీ నేతలు, గృహసారథులతో సహపంక్తి భోజనాలు చేశారు. సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, డైరెక్టర్ కోరాడ బాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, జిజ్జువరపు విజయనిర్మల, కర్రి శ్రీను, పార్టీ నేతలు అలాలక్ష్మీగణేష్, నిడికొండ నరేంద్ర, జిజ్జువరపు రమేష్, భారతి వెంకటరావు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే నానితో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలు



సహపంక్తి భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ ఈశ్వరి

బీసీల అభ్యున్నతే ప్రధాన అజెండా

- ఎమ్మెల్యే ఆళ్ల నానికి శ్రీసైనిక సంక్షేమ సంఘం నాయకుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు చెబుతున్న శ్రీసైనిక సంక్షేమ సంఘం నేతలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతే ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని పేర్కొన్నారు. ఏలూరులో శ్రీసైనిక సంక్షేమ భవనం నిర్మాణానికి ఉచితంగా 500 గజాల స్థలాన్ని మంజూరు కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి రూ.18 లక్షల ఆర్థిక సాయం నాని అందించారు. ఈ నేపథ్యంలో ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో శ్రీసైనిక సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించి, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ శ్రీసైనిక సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబాలకు సమావేశాలు, విందులు, సమస్యలపై చర్చించుకునేందుకు కనీస సౌకర్యం లేకుండా ఇబ్బందులు పడేవారమని, ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌కు రూ.లక్షలు వెచ్చించే స్తోమత లేక ఇబ్బందులు పడేవారమని చెప్పారు. ఎమ్మెల్యే నాని సహకారంతో కమ్యూనిటీ హాలు నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. బీసీలకు తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, శ్రీసైనిక సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

బాలగంగాధర్‌తిలక్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన బాలగంగాధర్‌తిలక్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : జూడో క్రీడలో ఏలూరు బాలగంగాధర్‌తిలక్ స్కూల్ విద్యార్థులకు పతకాలు సాధించారని స్కూల్ హెచ్‌ఎం కేవీ షడ్రక్ చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు విజయవాడలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న టి.వంశీ సబ్‌జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా, ఇ.హారిక సిల్వర్ మెడల్ సాధించిందని హెచ్‌ఎం చెప్పారు. వీరితో పాటు టి.వంశీ బ్రాంజ్ మెడల్, నాగూర్‌బాషా సిల్వర్ మెడల్, కె.శ్రావని బ్రాంజ్‌మెడల్ సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను కార్పొరేటర్ పిళ్లంగోళ్ల శ్రీదేవి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి అభినందించారు. విద్యార్థులకు పతకాలు రావడం పట్ల గణిత ఉపాధ్యాయుడు జి.రాఘవ, ఎస్ఎస్ మాస్టర్ శ్రీనివాసరావు, పీడీ కె.మాధవిలత హర్షం వ్యక్తం చేశారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సాబ్జి

ఏలూరు (టూటౌన్): బంజారా జాతి ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కొనియాడారు. సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి కార్యక్రమం బుధవారం స్థానిక స్వెట్ ఫిట్‌నెస్ సెంటర్ ఆవరణలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుగ్గులోతు కృష్ణ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాబ్జి మాట్లాడుతూ సేవాలాల్‌ను ఆశయాల ప్రకారం నడుచుకోవడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా బంజారాలు మాట్లాడే గోర్ బోలీనికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆర్.సూర్యారావు, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏబీఎస్ఎస్ నాయకులు బాణావతు మోహనరావు, భూక్యా నాగరాజు, ధారావతు చోక్లా నాయక్, గుగ్గులోతు బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు ఫిబ్రవరి 15వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక నంగార భేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడిత్య శ్రీనివాస్, దేవ సోత్ చంద్రనాయక్, ఇస్లావత్ బాలాజీ నాయక్, ధారావతు నాగేశ్వరరావు నాయక్, ఆలోతు సోమరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంస్కృతిపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

ఏలూరు (టూటౌన్): విశ్వబ్రాహ్మణ సంస్కృతి సంప్రదాయాలపై స్థానిక కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో బుధవారం ఏర్పాటుచేసిన శిక్షణను ఆచార్య చంద్రపాటి వరప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ప్రతి ఒక్కరూ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. బ్రాహ్మణత్వం, సంధ్యావందనం, వేదమంత్ర అధ్యయనం వంటి అనేక విషయాలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వేద బ్రహ్మశ్రీ తామడ మోహన్‌రావు, ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం కన్వీనర్ ఎ.శివశ్రీ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, గూడూరి హేమ దుర్గాప్రసాద్, కాదలూరి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

‘రక్షణ సైన్యం’ నూతన కమిటీల నియామకం



రక్షణ సైన్యం నూతన కమిటీల నాయకులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మోషే

ఏలూరు రూరల్: మండలంలోని మల్కాపురం (పాలగూడెం) రక్షణ సైన్యం చర్చికి నూతన కమిటీలను నియమించారు. ఈ కమిటీలతో ఏలూరు డీసీ జల్లి మేషే ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘ పెద్దలుగా గరికపూడి నెహ్రూ, కొత్తూరు గోపీకుమార్, వెంపా నాగరాజు, నల్లమెల్లి ప్రసాద్, మేనేపల్లి సుధాకర్, మాత్రపు చింతయ్య, గృహ సమితి సభ్యులుగా గరికపూడి సుప్రియ, పెనుమాల కుసుమ, గరికపాటి ప్రమీల, నత్తా సోనీ, రుంజల అంజలి, పెనుమాల కస్తూరి, పి.అరుణ నియమితులయ్యారు. మేజర్ జల్లి మేరీకుమారి, గేరా జాన్, మేజర్ గేరా రత్నకుమారి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	34
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12-15
బెండకాయలు	40	కంద	46
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	28
కాకర కాయలు	32-40	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	74
బీరకాయలు (పందిరి)	50	అల్లం	70
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30	పాలకూర	09
దొండకాయలు	28	చుక్కకూర	09
బంగాళదుంపలు	20	తోటకూర	09
ఉల్లిపాయలు	22	గోంగూర	09
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	28-30	బఠాణి	--
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ఆపస్ మహాసభల పోస్టర్ విడుదల



ఆపస్ మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎస్ఈఓ రవిసాగర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను బుధవారం జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కోరారు. విద్యార్థులను సక్రమ మార్గంలో నడుపుతూ వారికి బంగారు భవిష్యత్‌ను చూపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్‌వీకే రాజ్‌కుమార్ మాట్లాడుతూ మార్చి నెల 5, 6 తేదీల్లో నెల్లూరులో నిర్వహించే ఆపస్ రాష్ట్ర మహాసభల్లో విద్యా రంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందిస్తారని చెప్పారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు ఆర్.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికునికి సత్కారం

ఏలూరు (టూటౌన్): ఇటీవల సైకిల్‌పై షిర్డీకి వెళ్లి తిరిగి వచ్చిన నగరానికి చెందిన మాజేటి శ్రీరామమూర్తిని మన సండే వాకర్స్ అసోసియేషన్ తరపున బుధవారం సత్కరించారు. 75 సంవత్సరాల వయసులో 19 రోజుల పాటు దాదాపు 1700 కిలోమీటర్లు సైకిల్‌పై యాత్రను నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పెదవేగి : ఎమ్మెల్సీ ఎన్నికలకి సంబంధించి కోడ్ అమలులో ఉన్నందున సీఈఓ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించాల్సిన పెదవేగి సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరువాత నిర్వహించే సమావేశ తేదీని ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేస్తామని ఎంపీడీఓ చెప్పారు.

19 నుంచి ఢిల్లీలో జాతీయ స్థాయి శిక్షణ

దెందులూరు: జాతీయస్థాయిలో ఢిల్లీలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే అంశాలపై నిర్వహించనున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమానికి గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ నత్తానియేల్ ఎంపికయ్యారు. బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యాయామ విద్యలో భాగంగా నాయకత్వపు లక్షణాలు పెంపొందించే శిక్షణ, వ్యాయామ కళాశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నూరు శాతం విద్యాభివృద్ధి, సత్ఫలితాల సాధనపై శిక్షణ ఉంటుందని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీవీకేడీ ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తమ కళాశాల ప్రిన్సిపల్ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

నేడు చేపల చెరువు వేలం

పెదపాడు: స్థానిక పశువుల చెరువులో స్వభావికంగా పెరిగిన చేపలను ఒక్కరోజులో పట్టుకునే హక్కుపై వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి తెలిపారు. పెదపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1000 దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఏపీ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ వేణుగోపాల రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ వేణుగోపాలరెడ్డిని బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి వెలగపూడి కార్యాలయంలో కలిశారు. ఏలూరు నుంచి నూజివీడు వరకు రోడ్ల అభివృద్ధికి రూ. 42 కోట్లు నిధులు మంజూరు చేయాలని, ఏలూరు నుంచి కైకలూరు వరకు రోడ్డు నిర్మాణాన్ని ఎన్‌డీబీ ఫేజ్-1లో పెట్టాలని దెందులూరు నుంచి పంగిడిగూడెం రోడ్డులో చల్లచింతలపూడి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి నివేదికను అందజేశారు. నివేదిక పరిశీలించి సమస్య పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వేణుగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మాధవి సుకన్యను కలిసి పెదపాడు మండలంలోని వట్లూరులో అండర్ పాస్ నిర్మాణం, పెదవేగి మండలంలో విజయరాయి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై చర్చించారు.

ఎమ్మెల్సీ రఘురాం సతీమణికి నివాళి

దెందులూరు: ఎమ్మెల్సీ, ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం సతీమణి స్వర్ణకుమారి దశ దిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ రఘురాంను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గ్రామాల్లో ఆక్వా జోన్ పరిధిపై సర్వే

దెందులూరు: చేపల చెరువుల రైతులకు విద్యుత్ బిల్లు రాయితీ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా జోన్ పరిధిపై సర్వేకు ఆదేశాలు జారీ చేసిందని మత్స్యశాఖ సహాయకురాలు ఎస్.ప్రవల్లిక అన్నారు. బుధవారం పోతునూరులో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపల చెరువులు 10 ఎకరాల్లోపు ఆక్వా జోన్‌లో ఉంటే యూనిట్‌కు 1.50 పైసలు పవర్ సబ్సిడీ వర్తిస్తుందని లేకుంటే రూ.3.80 పైసలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.1.50 పైసలు పవర్ సబ్సిడీ వర్తించేలా ఆక్వా జోన్ పరిధిపై సర్వే చేయాలని మత్స్యశాఖ సహాయకులందరికీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. 2018లో ఆక్వాజోన్‌పై సర్వే చేసి పాత చేపల చెరువులను జోన్‌లో పెట్టారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి గెజిట్ సైతం విడుదలైందన్నారు. ప్రభుత్వపరంగా నిబంధనలకు లోబడి వృత్తిపరంగా ఆక్వా రైతులను ప్రోత్సహించడం, రాయితీలు సకాలంలో అమలు, అనుమతులు వేగంగా మంజూరు చేయడం కోసం ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. మత్స్యశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తోందన్నారు. దెందులూరు మండలంలో 2018లో 2,237 ఎకరాల చేపల చెరువులు జోన్ పరిధిలో ఉన్నాయని సర్వేద్వారా ప్రస్తుతం విస్తృతి పెరిగే అవకాశం ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన ఆక్వా చెరువులను సర్వే పూర్తి చేసి జోన్ పరిధి పెంచేందుకు అనుమతుల కోసం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. త్వరలో చేపల చెరువుల రైతులు రాయితీ పొందేందుకు ఆదేశాలు వెలువడనున్నాయన్నారు. గ్రామాల్లో మత్స్యశాఖ సహాయకులు చేస్తున్న సర్వేను దెందులూరు మండల ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి ఈశ్వర్ పర్యవేక్షిస్తున్నారు.

జూదరుల అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగుర్ని అరెస్టు చేశారు. రాణీనగర్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు పోలీసులు దాడి చేసి ఏడుగుర్ని అరెస్టు చేసి, రూ.2700 స్వాధీనం చేసుకున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

ఏలూరు టౌన్: మంగళవారం రాత్రి చాటపర్రులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగినట్టు సుపర్‌వైజర్ సిద్ధార్థ ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలు రూ.1 లక్షా 70 వేలు, కొన్ని మద్యం బాటిళ్లను తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు.